ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సన్నాహాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గణతంత్ర దినోత్సవానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. జిల్లాఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి సూచనల మేరకు పోలీస్ శాఖ డ్రై రిహార్సల్‌ను నిర్వహించింది. ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ రాంబాబు, అడ్మిన్ ఆర్ఐ వివిఎస్‌విడిఆర్ సిహెచ్ నాయుడు, పెరేడ్ కమాండర్లు రమేష్, మనోహర్, ఎల్‌విపి నాయుడు, సీతానగరం, జియ్యమ్మవలస ఎస్ఐలు రాజేష్, ప్రశాంత్, ప్రభుత్వ బ్రాంచ్ స్కూల్ ఎన్ సి సి క్యాడెట్లు రిహార్సల్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖకు చెందిన క్రైమ్ డాగ్స్, ఎక్స్‌ప్లోజర్ డాగ్స్ లైకా, బిందు, సాండి, మ్యాక్స్ నిర్వహించిన రిహార్సల్ అక్కడ ఉన్న వారందర్నీ ఆకట్టుకున్నాయి.

రెగ్యులర్ కమిషనర్ వచ్చేదెప్పుడో... పట్టణాభివృద్ధి జరిగేదెన్నడో?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రం, గ్రేడ్- 1 మున్సిపాల్టీ అయిన పార్వతీపురం పట్టణానికి రెగ్యులర్ అధికారులేక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మున్సిపాలిటీ గ్రేడ్-1 స్థాయిలో ఉన్నప్పటికీ అక్టోబర్‌లో బదిలీపై వెళ్లిన కమిషనర్ స్థానంలో నాలుగు నెలలైనా ఇంతవరకు రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడం చూస్తే పట్టణ అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధుల శ్రద్ధ ఎంతో ఉందో ఇట్టే అర్థమైపోతుంది. మున్సిపాలిటీలో రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో పట్టణ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదు. మున్సిపల్ పాలనపై దృష్టి పెట్టాల్సిన పాలకపక్ష కౌన్సిల్ సభ్యులు కనీసం మున్సిపాలిటీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇదే అదునుగా తీసుకుని కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు, సిబ్బంది ఎవరికి నచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారనే చర్చ పట్టణంలో జరుగుతోంది. జిల్లా కేంద్రంలో ఉన్న గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం మున్సిపాలిటీలో గత ఏడాది అక్టోబర్ 4న కమిషనర్‌గా ఉన్న కె.శ్రీనివాస్ ఇక్కడి నుంచి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లినప్పటి నుంచి ఇన్‌ఛార్జి కమిషనర్, ఎఫ్ఎసి కమిషనర్లతోనే కాలం వెళ్లబుచ్చుతుండడం గమనార్హం. రెగ్యులర్ కమిషనర్‌ను ఎందుకు వేయడంలేదోనని 30వార్డుల్లో ఉన్న స్థానికులతో పాటు, మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, కార్యాలయంలో పలు విభాగాల అధికారులు సిబ్బందికి అర్థం కావడం లేదు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో కార్యాలయంలో గల అన్ని విభాగాల్లో పాలన నత్తనడకగా సాగుతోందని చెప్పవచ్చు. కార్యాలయంలో రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా, వచ్చామా, వెళ్లామా అన్న చందంగా వ్యవహరిస్తున్నారని కార్యాలయంలో విమర్శలు వెల్లువెతుతున్నాయి. ఏడు నెలల క్రితం జరిగిన సంస్థాగత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర గెలుపునకు మున్సిపాలిటీలోనే అత్యధిక మెజార్టీ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశించిన పట్టణ ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్ర మున్సిపాలిటీపై దృష్టి సారించి రెగ్యులర్ కమిషనర్ నియామకంపై దృష్టి పెట్టి రెగ్యులర్ కమిషనర్‌ను తీసుకువచ్చి మున్సిపల్ పాలనను గాడిలో పెట్టి, పట్టణ అభివృద్ధికి చొరవ చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపాల్టీని పట్టించుకోని పాలకవర్గం

రెగ్యులర్ కమిషనర్ లేకే పట్టణ అభివృద్ధి కుంటుపడుతుంది

గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం పట్టణానికి రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా ఉంది. పట్టణ ప్రజలకు అందాల్సిన కనీస సదుపాయాలు సకాలంలో అందరం లేదు, రెగ్యులర్ కమిషనర్‌ను తీసుకువచ్చి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి.

పాకల సన్యాసి రావు,
పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి.

బాలికల అభివృద్ధే దేశానికి ఆదర్శం

ప్రజాశక్తి - సాలూరు

బాలికల అభివృద్దే దేశానికి ఆదర్శమని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సరాయివలస గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికల సంక్షేమానికి ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బాలికలు చదువుపై దృష్టి సారించి, అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. బాలికలు అన్నింటా ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఏకలవ్య పాఠశాలల నిర్మాణం పూర్తి చేసి అందిస్తామని మంత్రి తెలిపారు. విద్య, వసతి, భోజన సౌకర్యాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని, విద్యతో పాటు ఆటల్లోనూ రాణించాలని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులతో మంత్రి "బేటీ బచావో - బేటి పడావో" ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరులో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కురుపాం : ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఏగులవాడ, దండుసూర గూడ, టికె జమ్ము గిరిజన గ్రామాల్లో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులు గ్రామస్తులతో కలిసి బాలికల హక్కులు, బాధ్యతలు గూర్చి వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫీల్డ్ కోఆర్డినేటర్ సూర్యం బాలికల విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు ఆత్మస్థైర్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు, గ్రామస్తులకు అవగాహన కల్పించి మహిళలకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఆర్ట్స్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలికాదినోత్సవం నిర్వహించారు. బాలికల ఎదుగుదలకు ఆత్మస్థైర్యం, పట్టుదల ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ యు.పూర్ణిమ, ఉపాధ్యాయులు ఐ.పద్మావతి, వి.ప్రమీల, జిలక్ష్మి, సుభద్రమ్మ, బి.రేణుక, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : బాలికలు ఉన్నతంగా చదివి, అన్ని రంగాల్లో రాణించాలని ఎంపిడిఒ సత్యం అన్నారు. స్థానిక కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. బాలిక చదువుకు, సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, బాలికలను సంరక్షించండి, బాలికలను చదివించండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ శాంతి భవాని, ఎపిఎం ఎం.చక్రపాణి, సూపెర్వైజర్లు జ్యోతి లక్ష్మి, సుప్ర, ఆస్పిరేషనల్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మహేష్, కెజిబివి ఎస్ఒ భాగ్యలక్ష్మి, ఎంఇఒ శ్రీనివాసరావు ఉన్నారు.

పాలకొండ : జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాలలో జన చేతన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జన చేతన కార్యదర్శి బగాది శశిభూషణ్ చౌదరి మాట్లాడుతూ జాతీయ బాలికల దినోత్సవం గుర్తించినప్పటికీ మహిళలు పట్ల జరుగుతున్న వివక్షత పట్ల చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హెచ్ఎం బి.శ్రీదేవి మాట్లాడుతూ బాలికల్లో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చిరంజీవి, లత, కామేశ్వరమ్మ, సుగుణకుమారి, భారతరత్నం, సుందరి, రమా కుమారి, చిన్నమ్మడు, జనచేతన సిబ్బంది సరస్వతి తదితరులు ఉన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

ప్రభుత్వ బడులను కాపాడాలి

యుటిఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో ప్రభుత్వ బడులను కాపాడాలని పలువురు వక్తలు కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. 'విద్యారంగ పరిణామాలు -మన ఊరిబడి' అనే అంశంపై వక్తలు మాట్లాడారు. జీవో 117 ద్వారా గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందన్నారు. క్లస్టర్ విధానం, జీవో 117కు బదులుగా ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానం రూపకల్పన చేస్తోందని తెలిపారు. 1,2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలు గా, 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో చేర్చాలని యోచిస్తున్నట్లు తెలిసిందని అన్నారు. ముందు ప్రకటించిన విధంగా ప్రతి గ్రామపంచాయతీలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని సూచించారు. దీని వల్ల 115 ప్రాథమిక పాఠశాలలు ఫౌండేషన్ స్కూళ్లుగా మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. యుపి పాఠశాలల నుంచి 6,7,8 తరగతుల విద్యార్థులను ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు తరలించడం వల్ల జిల్లాలో 92 యుపి పాఠశాలలె 26కు కుదించబడతాయ న్నారు. యుపి పాఠశాలల్లో సహాయకులను నియమించాలని కోరారు. ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బి.వెంకటరమణ, ఐద్వా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, గిరిజన సంఘం నాయకులు వి.రామస్వామి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.జ్యోతి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలు పునఃప్రారంభం కారాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలు పునః ప్రారంభం కారాదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులకు తేల్చి చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించగా, మిగిలిన అర్జీలను పీజీఆర్ఎస్ కిందకు తీసుకొచ్చామన్నారు. కావున వాటిలో పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలకు తగిన కారణాలను వివరిస్తూ అర్జీదారుకు తెలియజేయాలని అన్నారు. పీఎం జన్ మాన్ పనులు, పిఎంఎవై 2.0 కింద నిర్మిస్తున్న గృహాలు వేగవంతం కావాలన్నారు. అనుమతులు పొంది నిర్మాణం కాని ఇళ్లను తక్షణమే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీచేస్తామని, ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎంజిఎస్‌వై కింద జిల్లాలో రహదారులు నిర్మించుకునే అవకాశం ఉందని, కావున వాటి వివరాలు సేకరించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె.హేమలత, కెఆర్ఆర్సీ ఎస్డీసి పి.ధర్మచంద్రారెడ్డి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఫైలేరియా నివారణ కార్యక్రమం విజయవంతం కావాలి

ఫిబ్రవరి 10 నుంచి 12 వరకు జిల్లాలో జరగనున్న ఫైలేరియా నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సర్వేలో బలిజిపేట మండలంలో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. అందులో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎండిఎ) కింద డిఇసి, ఆల్బెండ్జోల్ మాత్రలు మింగించాల్సిన అవసరం ఉందన్నారు. కావున వైద్యాధికారులు బృందాలుగా ఏర్పడి అవగాహన కల్పిస్తూ, ఫిబ్రవరి 10 నుంచి మందులను పంపిణీ చేయాలన్నారు. డిఇసి, ఆల్బెండ్జోల్ మాత్రలను పంపిణీ చేయడమే కాక, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఫిబ్రవరి 10 నుంచి వాలంటీర్లు, ఆశా వర్కర్లు , ఎఎన్ఎంల ఇంటి వద్దకు వెళ్లి ఫైలేరియా మందులను తినిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంపై ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

జైవిక్ అవార్డు గ్రహీత రవీంద్రను అభినందించిన కలెక్టర్

జైవిక్ ఇండియా అవార్డు గ్రహీత ఆరిక రవీంద్రను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా తనకు లభించిన జైవిక్ అవార్డును గురించి వివరించారు. ఉత్తమ ప్రకృతి వ్యవసాయం విభాగంలో రవీంద్రకు దక్షిణ జోన్‌లో మొదటి బహుమతి లభించింది. బహుమతి కింద లక్ష రూపాయలు నగదు, జ్ఞాపిక అందజేశారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, ఎంపెడా సౌజన్యంతో ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ సంస్థ ఈ అవార్డులను ప్రకటిస్తుంది. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జైవిక్ ఇండియా అవార్డులను ప్రధానం చేస్తారు. రాష్ట్రం ఆరు అవార్డులను దక్కించుకుంది. ఈ మేరకు ఈనెల 22న బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో బహుమతుల ప్రదానం జరిగింది. అందులో సీతంపేట మండలం దుగ్గికి చెందిన ఆరిక రవీంద్ర ఉండడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, అందులో భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాకు చెందిన వ్యక్తికి అవార్డు రావడం సంతోషంగా ఉందని భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షణ్ముఖ రాజు తదితరులు ఉన్నారు.

నిమ్మగడ్డిని విరివిగా పండించండి

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో సాగుకు శ్రీకారం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సుగంధద్రవ్యాల నిమ్మగడ్డి పంటను పండించడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని, కావున ఈ పంటను విరివిగా పండించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపునిచ్చారు. స్వల్పకాలంలో అధిక దిగుబడి పంటగా దీన్ని గుర్తించడం జరిగిందని, పక్క రాష్ట్రమైన ఒడిషాలోని ప్రతి గ్రామంలో రైతులు ఈ పంటను వేసి మంచి లాభాలు ఆర్జించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో నిమ్మగడ్డి పంటను రైతులు సాగుచేసేలా శ్రీకారం చుట్టామన్నారు. ఈ పంటను పండించే రైతులకు రెండు విడతల్లో 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఒక ప్రకటన జారీచేశారు. 2025 - 26లో ఎంఐడిహెచ్ పథకం కింద జిల్లాలో వెయ్యి ఎకరాల్లో నిమ్మగడ్డి సాగుకు రూ.100 లక్షల రాయితీని ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. బీసీ, ఎస్సి, ఇతర కేటగిరీల రైతులకు 40 శాతం సబ్సిడీతో మొదట విడత కింద రూ.4,800, రెండో విడతగా రూ.3,200 వెరసి రూ. 8వేలు సబ్సిడీ విడుదల చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కావున పొలం కలిగి, నిమ్మగడ్డి సాగుకు నీటి వసతి సౌకర్యం ఉన్న ఆసక్తి గల రైతులు తమ నివాస గ్రామాల్లో ఉండే గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి వివరాలను తెలుసుకుని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

19వ వార్డులో చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ పరిధిలో 19వ వార్డులో శుక్రవారం నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ పర్యటించారు జరుగుతున్న పారిశుధ్య పనులు పరిరక్షించి స్థానిక నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

కలెక్టర్‌కు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం పలువురు అధికారులు, అనధికారులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రికి అభినందనలు తెలుపుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పోలమాంబ ఉత్సవ కమిటీ ఏర్పాటు

చైర్మన్‌గా నైదాన తిరుపతిరావు ఎన్నిక
అభినందించిన మంత్రి గుమ్మిడి

ప్రజాశక్తి - మక్కువ

ఎట్టకేలకు పోలమాంబ రాష్ట్ర జాతరకు ఉత్సవ కమిటీని ప్రభుత్వ ఆదేశాలతో దేవాదాయ శాఖ నియమించింది. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగబోవు జాతర వరకు ఉండేలా చైర్మన్ నైదాన తిరుపతిరావుతో కలిపి 8మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ జారీ చేసినట్లు స్థానిక ఇఒ వివి సూర్యనారాయణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. కమిటీ నియామకం జరిగిన తర్వాత రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని చైర్మన్ తిరుపతిరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆమె నివాసంలో కలిసి కమిటీ ఏర్పాటుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాతర నిర్వహణ చేపట్టాలని ఆమె కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.గణపతిరావు, జె,భాస్కరరావు, ఆర్ వెంకటరమణ, జి.భవాని, పి.నారాయణ, మాణిక్యం, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ పరిధిలో రూ.25 కోట్లు రోడ్డు పనులను ఏ మాత్రం అనుభవం లేని కాంట్రాక్టర్ సుతాపల్లి రాముకు అప్పగించారని, ఆయన సొంత క్వారీకి చెందిన నాణ్యత లేని మెటీరియల్‌ను రోడ్ల నిర్మాణంలో వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షుడు చెల్లూరి జోగయ్య గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. సుతాపల్లి రాముకు చెందిన క్వారీలో తయారైన మెటీరియల్ నాణ్యత లేనిదని, గతంలో పిఆర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తిరస్కరించారని, ఇప్పుడు ఎలా రోడ్ల నిర్మాణంలో వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రక్తహీనత నివారణే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -గరుగుబిల్లి :

గర్భిణీలు, బాలింతల్లో రక్త హీనత నివారణే ప్రభుత్వ ధ్యేయమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు విధిగా తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయదేవి అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో గల అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి సరఫరా చేస్తున్న స్టాకు వివరాలను సరిచూశారు. అదే విధంగా పిల్లలచే పాటలు పాడించారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో గల కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌జెడి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ సిబ్బంది పోషకాహారంపై మరింత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని ఖాళీ ప్రదేశాల్లో కాయగూరల పెంపకం చేపట్టాలన్నారు. ప్రతినెలా 5న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రీస్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఉల్లిభద్ర ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు మరడాన కల్పన, ఎస్ లావణ్య ,తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జెడి చిన్మయదేవి

సాగుచేస్తున్న దళితులకు పట్టాలివ్వాలి

పేదలపై దౌర్జన్యం చేయిస్తున్న రాముపై కేసు నమోదు చేయాలి
కలెక్టర్‌కు సిపిఎం, వ్యవసాయ కార్మికసంఘం వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలం కరాసవలస పరిధిలో గుర్రప్ప వలస రెవెన్యూలో 5 ఎకరాలు సాగు చేస్తున్న దళితులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, పేదల మధ్య తగాదాలు సృష్టిస్తున్న పెత్తం దారులు సుతాపల్లి రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి గంగు నాయుడు, మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అనంతరం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు సాలూరు మండలం గుర్రప్పువలస రెవెన్యూలో దళితులు గత 50 ఏళ్లుగా ఐదెకరాల భూమిని సాగు చేసుకుంటున్నారని, దీనిపై సాలూరు పట్టణానికి చెందిన సుతాపల్లి రాము గారి కన్ను పడిందని తెలిపారు. దళితుల్ని దౌర్జన్యంగా తగిలేసి ప్రోక్లైన్ పెట్టి చదును చేయడానికి ప్రయత్నిం చేస్తే వారు అడ్డుకున్నారని కలెక్టర్ తెలియజేశారు, కావున సాగు చేస్తున్న దళితులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, దళితుల, గిరిజనుల మధ్య తగాదాలు సృష్టిస్తున్న రాముపై ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

రైతు వ్యతిరేక విధానాలపై 26న ర్యాలీ

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న ఎపి రైతు సంఘం, రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించనున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలో కరపత్ర ఆవిష్కరించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన పంటకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం, ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ పథకం విస్తరణ, కౌలు రైతులకు రక్షణ సాధించడంతో పాటు కార్మికులకు నష్టకరమైన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మరిన్ని పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈనెల 26న జరగబోయే నిరసన కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, కార్మికులు ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కాదా రాము, దూసి దుర్గారావు, పాపారావు, కె.గోవింద, ఎం.విజయ్‌కుమార్, వై శ్రీనివాసరావు, సిహెచ్ సంజీవి, ఎస్ నారాయణరావు, ఎం రమేష్, బి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

రీ సర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా విచారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రీ సర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారణ చేపట్టాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. మండలంలోని గోపాలపురంలో శుక్రవారం పర్యటించి రీ సర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రసీదులు పొందాలని స్పష్టం చేశారు. భూముల రీసర్వేలో తలెత్తిన లోపాలను భూ యజమానికి ముందుగా నోటీసులో అందించాలని, తర్వాత తదుపరిచర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివాదస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్ట్రర్లో నమోదు చేయాలన్నారు. రీసర్వేలో ఎక్కడా లోపాలు ఉండరాదని, అందుకు అవసరమగు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. రీ సర్వే తర్వాత తప్పులైన భూ రికార్డులు నెలకొల్పాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఇసుక అక్రమ ర్యాంప్‌పై సబ్ కలెక్టర్ చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురం వద్ద అనధికంగా నడుస్తున్న ఇసుక అక్రమ ర్యాంపు శుక్రవారం సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి కన్నెర్ర చేశారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన ఆయన స్వయంగా ర్యాంప్‌లోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఇసుక రవాణా చూసి ఆశ్చర్యపోయారు ఎక్కడున్న 6 లారీలు, 12 ట్రాక్టర్లు, 3 జెసిబిలను సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తెలియని తప్పని హెచ్చరించారు.

నేడు జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి డాక్టర్ టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరగనుందని, ఈ కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని మాతృభాష ఉపాధ్యాయులు వినతి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో పని చేస్తున్న మాతృభాష ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమశాఖ డైరక్టర్ ఎస్.భార్గవికి ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకులు పి.అప్పల నర్స, రాష్ట నాయకులు పి.బాలదేవ్, మాతృభాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ విజయవాడలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని చెప్పారు. అనంతరం ఆమె స్పందిస్తూ మాతృ భాష ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం అభినందించారు. ఇటీవల గుంటూరులో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారు లను శాలువతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో మరింత ఉత్తమ ప్రదర్శన కనబర్చి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ కోచ్ సిహెచ్ రామచంద్రరావు, ప్లేయర్స్ శ్రీనువాసరావు, మోహనరావు, జయరాం, సోమేశ్వరరావు, దొరబాబు, రాంప్రసాద్, చంద్రరావు,పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, రాజు, వేణు కూమార్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఉపాధి హామీ పనులు మొదలుపెట్టి వలసలను ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు నాయకులు శుక్రవారం డ్వామా పీడీ కె.రామ చంద్రరావుకు శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు జిల్లా నాయకులు, గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్ రావు, ధర్మవరపు పైడిశెట్టి, టి.జీవ మాట్లాడుతూ వ్యవసాయ పనులు గ్రామాల్లో ముగియడంతో పండగ ముగియడంతో ఉన్న గ్రామాల్లో ఎటువంటి ఉపాధి అవకాశాల్లేక వ్యవసాయ కార్మికుల కుటుంబాలతో సహా వలసలు వెళ్లిపోతున్నారన్నారు. ఈ వలసలను వెంటనే నివారించాలంటే ఉపాధి పనులు ప్రారంభించాలని, జాబ్ కార్డు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని, రోజువారి కూలీలు రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్.ములగలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నడిమి, ములగ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచి మడక కృష్ణవేణి విశ్వనాథం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముగిసినందున పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలువల్లో వ్యర్థాలను తొలగించడంతో పాటు, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు తెలిపారు.

పెంచిన కూలి రేట్లు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి పెంచిన కూలీ రేట్లు వర్తింపజేయాలని హమాలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిసిసి గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌర సరఫరా సంస్థల్లో పనిచేస్తున్న హామాలీలకు ప్రభుత్వం ఇటీవల పెంచిన కూలీ రేట్లు వెంటనే అందజేసి, ఏరియర్స్ అందించాలని, లేని పక్షాన పెద్దయెత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

దుడ్డుఖల్లు పిహెచ్‌సిని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

గుమ్మలక్ష్మీపురం : మండలం లోని దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎం హెచ్ఒ డాక్టర్ కె.పద్మావతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హైరిస్క్ గర్భిణుల మోటివేషన్, ఎన్‌సిడిసిడి, మలేరియా సర్వేలెన్సు వివరాలను డాక్టర్ ప్రవీణ్ ను అడిగి తెలుస కున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. దుడ్డుఖల్లు పంచాయతీ చింతలపాడులో ఎలొసిడిసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు గ్రామ సర్పంచ్ ఎన్. నీలావతి వైద్య సిబ్బంది ఉన్నారు.

పశు సంపద వృద్ధే ప్రభుత్వ ఆశయం

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో పాడి పశు సంపద వృద్ధిచెంది రైతులు ఆర్థిక పరిపుష్టి చెందాలన్నదే ప్రభుత్వ ఆశయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని కృష్ణరాయపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశుఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణతో జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని ప్రభుత్వం వివిధ పథకాలతో పాడి రైతులకు ఊతమందిస్తున్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ చట్టం కింద ఈ ఏడాది 390 వరకు గోకులాల షెడ్లు మంజూరు చేశామన్నారు. పశు కిసాన్ రుణ కార్డులను అందజేసి రూ.లక్ష 60వేల వరకు పశు పోషణ నిర్వహణ, పశు గ్రాసాల కోసం జీరో వడ్డీతో రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. సహాయక సంఘ సభ్యులకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు కొనుగోలుకు రూ.30 వేల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేసి మహిళల ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చేయూతనందిస్తున్నామని తెలిపారు. పాడి రైతులకు భారం పడకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి పశువులకు, జీవాలకు ఉచితంగా టీకాలు వేస్తున్నారన్నారు. పశుగ్రాస క్షేత్రాలను నిర్వహించేందుకు రైతులు ముందుకు రావాలా తక్షణమే మంజూరు చేయాలన్నారు. వెంకటసాగరం నుండి రాం కోనేరు వరకు ఆక్రమణలను తొలగించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా వెంటనే జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు పశు సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని పరిశీలించి పశు వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెల నుంచి 12 నెలల దూడలు ఆరోగ్యంగా ఉండేలా సంరక్షణ కొరకు రైతుల్లో స్ఫూర్తి నింపేందుకు నిర్వహించిన పశు దూడల ర్యాలీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దూడల రైతులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్ మన్మథరావు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాముల నాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జి, సర్పంచ్ అన్నం నాయుడు, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపిడిఒ త్రివిక్రమ్, పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ దీనకుమార్, కె.ప్రసాద్, పశు వైద్యులు డాక్టర్ రామారావు, చక్రధర్, జానకీరామ్, గ్రామ సచివాలయ పశువైద్య సహాయకులు, పాడి రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

ఆవును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్ : మండలంలోని సంగం వలసలో ఎడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరానికి పరిసర గ్రామాల నుంచి పాడి రైతులు తమ పశువులను, గొర్రెలు మేకలను తీసుకువచ్చి వ్యాధి నివారణ మందులు వేయించారు. పాల ఉత్పత్తులు పెరుగుదలకు, మూగ జీవాల ఆరోగ్యానికి మేలైన పద్ధతులు పాటించాలని, ఎప్పటికప్పుడు స్థానిక పశు వైద్యులతో సంప్రదింపులు జరిపి వారి సలహా ప్రకారం పశువులను పెంచుకోవాలని ఎడి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బడే శ్రీరంజన్, మాజీ సర్పంచి అమరాపు రామకృష్ణ, పశువైద్యుడు రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడిచిపెడుతున్న మంత్రి సంధ్యారాణి

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పాచిపెంట

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఐటిడిఎ ఆర్థికసాయంతో శత శాతం రాయితీతో 6,11,250 చేప పిల్లలను పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం ఆమె విడిచిపెట్టారు. 80 నుండి 100 మిల్లీమీటర్ల సైజు గల కట్లు 40 శాతం, రోహం 50 శాతం, మృగాల చేప పిల్లలు 10 శాతం రిజర్వాయర్‌లో వదిలారు. తొలుత సరాయివలస గిరిజన గ్రామం వద్ద రూ.2కోట్లు వ్యయంతో నిర్మించనున్న వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో మత్స్య సంపదను అభివృద్ధి పర్చాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన సామాగ్రిని కేటాయించేలా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, ఐటిడిఎ నోడల్ అధికారి బి.సత్యనారాయణ, సాలూరు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి, మండల టిడిపి అధ్యక్షులు పి.ప్రసాద్ బాబు, కార్యదరి గండేపు యుగాంధర్, పెద్దగెడ్డ నీటి సంఘం అధ్యక్షులు, ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు బర్రి చిన్నప్పన్న, కొటికిపేట సర్పంచ్ ఇజ్జడ అప్పునాయుడు, కొడికాళ్లవలస మత్స్యకార సంఘం అద్యక్షులు బచ్చల జోగారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

26న ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 26న ఉదయం 8.30 గంటలకు జిల్లా సబ్ ట్రెజరీ పరిధిలో గల రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రైతు బజార్ వెనుక ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ పింఛనుదారుల సమావేశానికి హాజరుకావాలన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు పింఛనుదారుల సంఘం అధ్యక్షునిచే జెండా వందనం నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ఈనెల 21న రాష్ట్ర సమావేశంలో చర్చించిన విషయాలు, తీసుకున్న నిర్ణయాలు తెలియజేస్తామన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు సేకరించిన అటవీఉత్పత్తులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేస్తామని జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ అవగాహన కల్పించారు. మండలంలోని లాడ, పాంగ్ర గ్రామాల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకే ప్రభుత్వం నిర్ణించిన ధరలకు మీరు సేకరించిన అటవీ ఫలసాయాలైన చింతపండు, చీపుర్లు, నల్లజీడి పిక్కలు, కరక్కాయలు మొదలైనవి కొనుగోలు చేస్తామని తెలిపారు. జిసిసి కొత్తగా పెంచిన ధరల ప్రకారమే కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మెన్లు కె.కాంతారావు, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : దళారులు నమ్మి మోసపోకండి, అటవీ ఉత్పత్తులు జిజిసి ద్వారా కొనుగోలు చేస్తామని జిజిసి మేనేజర్ కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వలసబల్లేరులో అటవీ ఉత్పత్తులపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు శాండీ పాయింట్లోనే కాకుండా గ్రామంలో డిపో పరిధిలో ప్రభుత్వ నిర్దేశించిన మద్దతు ధరకే మీ ఇంటికి వచ్చి జిసిసి సిబ్బంది కొనుగోలు చేస్తామని తెలిపారు. కావున దళారులకు సరుకులు ఎవరు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సాంబశివరావు, శాండీ ఇన్‌స్పెక్టర్ విజయ కుమార్, సేల్స్‌మేన్లు పాల్గొన్నారు.

కురుపాం : గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న జిసిసి అధికారులు

జాలర్లకు చిక్కిన వింతచేప

మండలంలోని అర్తలిలో చెరువులో చేపలు పడుతుండగా వింత చేప చిక్కింది. ఒంటి నిండా ముళ్లు ఉండడంతో గ్రామస్తులు తండోపతండాలుగా వచ్చారు. డెవిల్ చేపగా గుర్తించారు. ఇది చేప మిగిలిన చేపల్ని చెరువులోనే తినేస్తాయని మత్స్య కారులు చెప్తున్నారు.

-ప్రజాశక్తి, పాలకొండ.

'ఎల్ఐసి ఏజెంట్ల ఐక్యతను చాటుదాం'

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎల్ఐసి ఏజెంట్ల ఐక్యతను చాటి, పాలసీదారులకు భద్రత కల్పించాలని విశాఖ డివిజన్ ఎల్ఐసి ఏజెంట్ల ఎన్నికల అధికారి లాడి స్వరూపకుమార్ అన్నారు. ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినం సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ల భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల ఐక్యత ఎంతో అవసరమన్నారు. గత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ఎల్ఐసి అనేక మార్పులు రావడంతో ఏజెంట్లకు జరుగుతున్న నష్టాన్ని గుర్తు చేశారు. అలాగే పాలసీదారుల కడుతున్న ప్రతి రూపాయికు భరోసా ఇస్తూ ఎల్ఐసిని ప్రపంచంలో నెంబర్ వన్ సంస్థగా చేస్తున్నప్పటికీ ఐఆర్‌డిఎ తీసుకుంటున్న మార్పులతో అటు సంస్థకు, ఇటు ఏజెంట్లకు పరోక్షంగా నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఏజెంట్ల ఐక్యత ఎంతో అవసరమని, ఇందుకోసం కార్యవర్గ ఎన్నిక అనివార్యమని తెలిపారు. అనంతరం ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. పార్వతీపురం బ్రాంచ్ ఎల్ఐసి అధ్యక్షులుగా లచ్చిపాత్రని రామకృష్ణ, కార్యదర్శిగా మద్రాపు నారాయణస్వామి, కోశాధికారిగా కొత్తకోట రమేష్, ఉపాధ్యక్షులుగా చెరుకూరు జగదీశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా పోలిశెట్టి నాగేశ్వరరావు, చెక్కా వెంకట్రావు, గుంట్రెడ్డి జగన్నాథం నాయుడుతో పాటు ఉపాధ్యక్షులుగా ఎం.సన్యాసినాయుడు (రంగనాథ్), మండాది శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీగా తూముల శ్రీనివాసరావు, తులాల కేశవరావు, పిట్టల గోపాలరావు ఎంపికయ్యారు. అనంతరం బ్రాంచ్లో అత్యధిక వ్యాపారం చేసినందుకు గానూ గెంబలి కేశవరావు, రొంపిల్లి శంకర్రావు, కె.తవిటినాయుడు, తూముల శ్రీనివాసరావు, జగన్మోహ్మనరావును నూతన కార్యవర్గం తరపున సత్కరించారు.

మంచి విషయాలపై బాలికలు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - కొమరాడ

బాలికలు మంచి విషయాలపై శ్రద్ధ చూపాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కనకదుర్గ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సదర్భంగా శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో సమగ్ర శిక్ష, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఐఆర్‌పి డబ్ల్యూఎ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పార్వతీపురం పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కనకదుర్గ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. డిఇఒ ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సంకల్ప బలంతో చదవాలని, చక్కన ప్రణాళిక తయారు చేసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. జిసిడిఒ మధు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యక్తిగతంగా ఆలోచించి, మంచి దృక్పథంతో విజయం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు మాట్లాడుతూ మంచి ఆలోచన విధానం, సామాజిక దృక్పథంతో ఉండాలని, ప్రతి ఆడపిల్ల తల్లిదండ్రులకు మంచి పేరు వచ్చేలా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా బాలికలకు 50 దోమతెరలు పంపిణీ చేశారు. బాలల సంక్షేమ మాజీ అధ్యక్షులు ప్రసాదరావు పట్నాయక్ మాట్లాడుతూ బాలికలు టెక్నాలజీని ఉపయోగించుకుని మంచి విషయాలు సేకరించి ముందు కొనసాగాలని, నేటి మొబైల్స్ ఇంటర్నెట్తో చెడు మార్గాన్ని వెళ్ళరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జున, పాసింజర్ కమిటీ జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్, కెజిబివి ప్రత్యేకాధికారి అరుణ, పాసింజర్స్ అసోసియేషన్ కార్యదర్శి వి.శ్రీహరి ఐఆర్పిడబ్ల్యూ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, కెజిబివి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మంచుపల్లి శ్రీరాములు

సీతంపేట: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. సీతంపేటలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ బాలికలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సీతంపేటలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎంపిడిఒ గీతాంజలి, డిప్యూటీ డిఇఒ, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - కొమరాడ

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలకు కృషి చేయాలని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ ఫేస్-2 లో భాగంగా శిక్షణా తరగతులు ఎంపిడిఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిపి శ్యామల, జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ లక్ష్యాలన్నారు. వృత్తి నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక విద్య, సమానత్వాన్ని అందించడంతో పాటు సంపూర్ణ వయోజన విద్య కోర్సుల ద్వారా నిరంతర విద్యను ప్రోత్సహించడం ఉల్లాస్ పథకం లక్ష్యాలని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం సురేష్‌బాబు, సీసీలు, మండల సమైక్య సభ్యులు వాలంటీర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ ఉల్లాస్ విద్య వాలంటీర్లకు ఆదేశించారు. స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఉల్లాస్ విద్య వాలంటీర్లతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలో 133 మంది స్వచ్ఛంద వాలంటీరీలను గుర్తించామని, ఒక్కొక్కరు పదిమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ ఎడి వైకుంఠరావు, ఎపిఎం కె.రాము, ఎఫ్‌పిఒ సిపి వై.ఆనంద్, ఉల్లాస్ విద్య వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

పార్వతీపురంరూరల్ : మహిళలకు ఉల్లాస్ పథకం ద్వారా అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉల్లాస్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మూడు నెలల పాటు వయోజనులైన వారికి ఆర్థిక అక్షరాస్యత, నాకు సేవలు తదితర వాటిపై శిక్షణ అందించి వారి ద్వారా మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ప్రతి పదిమందికి ఒక వాలంటీర్ ఈ పథకంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ సన్నిబాబు, ఇఒపిఆర్‌డి రమణమూర్తి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రత సామాజిక బాధ్యతగా భావించాలి

పార్వతీపురంరూరల్ : రహదారిభద్రత మనందరి సామాజిక బాధ్యతని, ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు దృష్టి సారించాలని ఎస్‌పి డాక్టర్ దిలీప్ కిరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో స్థానిక ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం రోడ్డుభద్రత చర్యల్లో భాగంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు సామాజిక బాధ్యతగా తమవంతు సహకారంగా 20 ట్రాఫిక్ స్టాపర్లను ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, బందోబస్తు విధులకు స్టాపర్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, పట్టణ సిఐ మురళీధర్, ఆర్ఐ నాయుడు, ఎస్ఐలు పాపారావు, సురేష్, ఫకృద్దీన్, ఆర్ఎస్సైలు, ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యానికి చెందిన ఏరియా మేనేజర్ ఎన్.రామ్మోహన్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ ఆర్.గోవర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఎ.శ్రీరాములు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ పోస్టుల నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో ఇటీవల జరిగిన రేషన్ డీలర్ పోస్టుల నియామకాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానికేతరులకు, అనర్హులైన అభ్యర్థులకు ఈ పోస్టులను కట్టబెట్టారన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

నారు శుద్ధితో వరిలో ఉల్లికోడు నివారణ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుత రబీ సీజన్లో చాలా ఆలస్యంగా వరి నాట్లు పడుతున్నందున ఉల్లికోడు, కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశం ఉందని, ఒక్కసారి ఉల్లికోడు వస్తే ఆ తర్వాత నివారణ చర్యలు చేపట్టినా ఫలితం ఉండదని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం మధుసూదన్ రావు అన్నారు. మండలంలోని కోస్టువలసలో వరి నారు మడులను పరిశీలించిన అనంతరం రైతులకు నారు శుద్ధి విధానాన్ని వివరించారు ప్రధాన పొలంలో సుమారుగా 30 రోజుల పాటు పురుగులు ఆశించకుండా ఉండాలంటే నారుమడి యాజమాన్యం తప్పనిసరి అని సూచించారు. ఉల్లి కోడు ఆశించకుండా ముందుగానే ఎకరాకు 10 కిలోల కార్బోఫిరాన్ 3జీ గుళికలను చల్లుకోవాలని సూచించారు. విఎఎలు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, విఎఎ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు అందుబాటులో ఉండాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా వైద్య శిబిరాలు యాత్రికులకు అందుబాటులో ఉండేలా చూడాలని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను ఆదేశించారు. శుక్రవారం ఆయన శంబర పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా జాతరలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య భవనం పనులను, ఆరు బెడ్లు ఏర్పాటు చేస్తున్న గదులను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పిఒ వినోద్, వైద్యాధికారులుకిరణ్ కుమార్ రమ్య సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పాపంవలసలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు సమయానికి వచ్చి నిర్ణయించిన కొలతలు ప్రకారం పని చేయాలన్నారు. దీంతో కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

మండలంలోని చెల్లంనాయుడువలస, పెదభోగిలిలో గల చెత్త తయారీ సంపద కేంద్రాన్ని ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి దాన్ని నుంచి సంపద సృష్టించి ఆర్థిక వనరుగా ఉపయోగించాలన్నారు. దీనివల్ల వచ్చే ఆర్థిక వనరును పంచాయితీకి ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.పీటర్, ఇంచార్జి ఇఒ రమేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేగావతిలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - మక్కువ

పట్టణంలో శుక్రవారం వేగావతి నదిలో పడి తుపాకుల శివ శివశంకర్ (25) మృతి చెందినట్లు టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. శివశంకర్ శవమై వేగావతి నది ఒడ్డున పాకీవీధి సమీపంలో పడి ఉండడాన్ని గుర్తించిన తల్లి తుపాకుల మంగమ్మ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం బహిర్భూమికని వెళ్లి తాగిన మైకంలో నది నీటిలో పడి మృతి చెంది ఉంటాడనే కోణంలో కేసు నమోదు చేసినట్లు సిఐ అప్పలనాయుడు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కురుపాం

గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలం బుడ్డెంఖర్జలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం గ్రామానికి చెందిన పొదిలాపు పారయ్య (24) ఉదయం గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి వెళ్లాడని, వెంటనే కురుపాం సిహెచ్‌సికి తరలించామని తెలిపారు. అక్కడ వైద్యాధికారి కె.సందీప్‌కుమార్ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యానికి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారని తెలిపారు.